ప్రత్యూష. ఆకాశ నీలంరంగు ఆమెకెంతో ఇష్టం. అది ఆమె ఒంటికి సూటవుతుందని ప్రక్కింటి పిన్నిగారి కూతురు చెప్పింది మొదలు ఆ చీరకోసం కలవరిస్తోందామె.

ఈ విధంగా ఆమె సరదాని తీర్చాడు సూర్యం. ''అత్తయ్యగారూ! ప్రత్యూని మీరు మరీ ఎక్కువగా తిట్టారు. అసలే అత్తమామలు లేని కోడలు కదా! తన ఇష్టాన్ని నాతోకాక ఎవరికి చెప్పుకుంటుంది? అయినా ఇదంతా నా తప్పే!'' అని బుద్ధిగా ఒప్పేసుకున్నాడు.

అల్లుడి మంచితనం, తన కూతురంటే అతనికెంత ప్రేమో తెలిసిన కామేశ్వరీ ''ఆమాత్రం దారిలో పెట్టాలి బాబూ!'' అంది కోపం చూపిస్తూ. అందరూ పెళ్ళికెళ్ళి వచ్చారు.

ఆ రాత్రి అల్లుడు వినకుండా కామేశ్వరి కూతురికి చెప్పింది.

''నిన్నరాత్రి కాస్త ఎక్కువగానే తిట్టానే అమ్మడూ! తెగేదాకా వ్యవహారాన్ని లాగకూడదు. అందుకే నీమీద అలా కోపం నటించాను.

నేను అలా అనేసరికి అతని మనసు తృప్తిపడుతుంది.

పైగా నీమీద సానుభూతి పెరుగుతుంది కూడాను. చూశావుగా ఫలితం! ఎంతమంచి చీర తెచ్చాడో. వెయ్యి రూపాయలట అది!''

''లేదమ్మా! ఆయన చాలా అమాయకులే!'' అంది ప్రత్యూష.

''అదలా ఉండనీ'' అంది కామేశ్వరి లాజికల్‌గా. అది కూతురికి శిక్షణ లాంటిది కదా!

ఎందుకంటే-ఈనాటి కూతురు రేపటికి కాబోయే అత్తగారేగా!

**-నారాయణ డి.వి.వి.ఎస్.**
**(వనపర్తి)**

# సందేహం

**నాలుగు రోజుల సెలవు తర్వాత పోస్టాఫీస్ తెరవడంతో విపరీతమైన రద్దీగా ఉంది. స్టాంప్స్ వెండర్ ఆరోజు శెలవు పెట్టడంతో ఆ పని కూడా క్లర్క్ గోవిందంపై పడింది.**

యస్.బి. విత్‌డ్రాయల్స్ డిపాజిట్స్ రాసి రాసి చేతులు నొప్పి పుడుతున్నాయి. వెళ్ళేవాళ్ళు వెళుతుంటే, వచ్చేవాళ్ళు వస్తూనే ఉన్నారు. ఊపిరి సలపని పని.

సరిగ్గా ఆ టైంలో వచ్చేడీ కస్టమర్ ''ఈ కవర్‌కి ఎంత స్టాంప్ అంటించాలో చెప్పండి?'' అడిగాడు.

ఎంతో అనుభవమున్న గోవిందం ఆ కవర్ చూడగానే దాని బరువు ఊహించి ''ఐదు రూపాయిలు'' చెప్పాడు.

ఆ వ్యక్తి డబ్బులివ్వడంతో అతనికి స్టాంప్ ఇచ్చి తన పనిలో నిమగ్నమైనాడు. ఐదు నిముషాల తర్వాత రిలాక్సేషన్ కోసం తలెత్తాడు.

ఇందాకా స్టాంప్ కొన్న వ్యక్తి స్టాంప్ అంటించకుండా దాన్ని పరిశీలనగా చూడటం గమనించి ''ఏంటి సార్ అలా చూస్తున్నారు'' అంటూ అడిగాడు.

''అబ్బే ఏం లేదు?'' అంటూ తిరిగి ఆ స్టాంప్‌ని పరిశీలనగా చూడసాగాడు.

గోవిందం తిరిగి తన పనిలో నిమగ్నమైనాడు. మరో పదినిమిషాల తర్వాత మరోసారి తలెత్తాడు. ఇందాకటి వ్యక్తి అప్పటికీ ఆ స్టాంప్ అంటించకుండా అదే పనిగా దాన్ని పరిశీలిస్తున్నాడు.

''ఏమిటి మాస్టారూ? మీ ఇబ్బంది ఏంటో చెప్పండి. మీరలా నుంచొంటే వెనకవాళ్ళకు అడ్డం. మీ డౌట్ ఏంటో చెప్పండి'' చిరాగ్గా అడిగాడు గోవిందం. మిగిలిన జనాలు కూడా అతని వైపు వింతగా చూసారు.

యధాప్రకారం ఆ వ్యక్తి గోవిందం వైపు చూసి ''అబ్బే ఏం లేదు'' అంటూ తిరిగి స్టాంప్ పరిశీలనలో నిమగ్నమైపోయాడు.



గోవిందం చిన్నగా తల కొట్టుకుని తన పనిలో నిమగ్నమైపోయాడు. మరో ఇరవై నిముషాలు గడిచాయి. మరోసారి తలెత్తిన గోవిందానికి అదే దృశ్యం కనిపించింది. దాంతో గోవిందానికి బి.పి. రైజ్ అయ్యింది.

''మాస్టారూ ఇందాక మీకొకసారి చెప్పాను. మీ డౌట్ ఏంటో చెప్పండి?'' కాస్తంత కోపంగా అన్నాడు.

ఆ వ్యక్తి జవాబు చెప్పేలోగా ''అసలో నకిలీనో పరీక్షిస్తున్నాడేమో?'' అన్నారెవరో చిన్నగా.

కిసుక్కున నవ్వారు మరెవరో. స్టాంప్‌ని ఈసారి భూతద్దంలో పరీక్ష చేస్తున్న ఆ వ్యక్తి చిరునవ్వు నవ్వాడు.

ఆ మాట విన్న గోవిందం ''మాస్టారూ దొంగ నోట్లలా దొంగ స్టాంపులు వస్తున్నాయి, నిజమే. కానీ అది దొంగస్టాంపు కాదు, అసలుదే. అంటించండి'' చిరాగ్గా చెప్పి తన పనిలో నిమగ్నమైనాడు.

ఈసారి పోస్ట్‌మాస్టర్‌కి కూడా కోపం వచ్చింది. మరో పదినిముషాలు గడిచాయి. అనుమానంతో తలెత్తి చూసిన గోవిందానికి అదే దృశ్యం కనిపించింది.

''ఏమండీ ఎందుకండీ మా ప్రాణాలు తీస్తారు? అసలెందుకు దాన్నలా పరీక్ష చేస్తున్నారు. పైగా భూతద్దంలో. చెప్పండి ప్లీజ్! మీకు దణ్ణం పెడతాను'' ఈసారి రెండు చేతులు జోడించి అడిగాడు.

''అదికాదు సార్! ఈ స్టాంప్‌కు ఎక్స్‌పైరీ డేట్ ఎక్కడుందోనని చూస్తున్నా'' చెప్పాడు మెడికల్ రిప్రజెంటేటివ్.

'దబ్'మన్న శబ్దం పెద్దగా కావడంతో అందరూ అటువైపు చూశారు. పాపం పోస్ట్‌మాస్టర్ తన పాతికేళ్ళ సర్వీస్‌లో అంత భారీ జోక్ వినక కాబోలు, వెనక్కు కుర్చీతోసహా విరుచుకుపడిపోయి పిచ్చిచూపులు చూడసాగాడు.

**-కలపర్తి సత్యం (ఏలూరు)**